# ఎందుకు?

'బాబాయ్! కథ లెలారాస్తారు?...'

ఆతృతగా అడిగేడు తొమ్మిదేళ్ళ నారాయణ.

'కాయితాల మీద కలంతో'... బాబాయ్ పుస్తకంనుంచి తలెత్త కుండా చెప్పేడు.

'అదిసరే బాబాయ్! అసలెలారాస్తారు? ఎందుకు రాస్తారని...'

'చెప్పేనుగా. వెళ్లాడుకోవోయ్' బాబాయ్ కొంచెం విసుగ్గా అన్నాడు.

'చెప్పు బాబాయ్! నాకొక కథ రాయాల్నుంది...'

బాబాయ్ తలెత్తేడు. నారాయణ చిత్తుపుస్తకం, కలంతో ప్రాధేయంగా చూస్తున్నాడు.

బాబాయ్ పుస్తకం పేజీ గుర్తుగా మడిచేడు.

'నిజమే నాకూ తెలీదోయ్ ఎలా రాస్తారో...... ఎవరైనా కనుక్కుచెప్తా.'

నిజమే. కథలెలా రాస్తారు? అసలెందుకు రాస్తారు ?

పక్కింటి సీతారావుడు మాంచి హుషారైన కుర్రాడు. కాలేజీలో చదువుతున్నాడు. కథలు, నాటికలు, నాటకాలు రాస్తాడు. నిముషాలమీద రాసిపారేస్తాడు. అర్జంటురచయిత. బాబాయ్ ఆశ్చర్యపోతాడు. సీతారావుడు ఎలా రాసేస్తాడో అని.

'బాబాయ్! కొత్త కథ రాసేను' సీతారావుడు.

సీతారావుడు సన్నగా వుంటాడు. బుగ్గలున్నాయి. మెరిసే కళ్ళు న్నాయి. పంధొమ్మిదేళ్ళవాడు.

'ఎప్పుడు రాసేవోయ్?'

'నిన్న రాత్రి.'

'చిత్తా, సాఫా?'

'రెండూనూ... చదువుతాను మరి... అట్టే సేపు పట్టదు...'

'ఊఁ కానీ...నువ్వు రాసినంత సేపు పట్టినా ఫర్వాలేదు.'

'అబ్బే అంత సేపు పట్టదు...' చదువుతున్నాడు.

'రాత్రి పది దాటింది. చీకటి క్రీనీడలంట ఒక స్త్రీ బెరుకు బెరుకుగా వెళ్ళిపోతోంది. ఎవరో ఆమెని వెంటబడుతూన్నట్టనుమానిస్తుంది. అతను దగ్గర పడిపోతున్నాడు. అక్కడొక యిల్లు. గబుక్కున అందులో ప్రవేశించింది. ముందుగదిలో చీకటి. ఆ గదిలోంచి వెనుక గదిలోకి వెళ్ళిపోయింది. అందులో ఒక యువకుడున్నాడు. ఆమె కెవ్వున అరవ బోయింది. అతడామె నోరు చటాల్న నిమ్మళంగా నొక్కేడు. ఆమె ఒక్కడుగు వెనక్కెళ్ళింది.

'ఎవరు మీరు!' ఆమె.

'మీరెవరు...' అతడు.

(ఆమె వెక్కి వెక్కి యేడుస్తూ నోటికి చెయ్యి అడ్డం పెట్టుకుని వెనక్కి వెళ్ళింది.)

'ఆగండి...' అతడు.

ఆమె సగం వెనక్కి తిరిగి సగం దీనంగా ... సగం కోపంగా చూసింది.

'సరళా! ఇలా ఈ కుర్చీలోకూచో...ఎక్కడికి వెళ్లిపోతున్నావు?

'నరకంలోకి...నన్ను వెళ్ళనివ్వండి...' ఆమె ఏడుస్తూ అంది.

'వాడీపాటికి వచ్చేవుంటాడు. వాణ్ణి నువ్వు తప్పించుకోలేవు. వాడు నిన్ను నాశనం చేస్తాడు.'

ఆమె వెక్కి వెక్కి ఏడుస్తుంది, అతడామె భుజంమీద నిమ్మళంగా చెయ్యివేస్తాడు. ఆమె కన్నీళ్ళతో తల దించుకొంటుంది. అతడు అనునయంగా అన్నాడు.

'సరూ...నాకు తెలుసు నువ్విక్కడికొస్తావని...'

ఆమె అతని చెయ్యి దూరంగా విసిరింది.

'నీకు సిగ్గులేదు. రాక్షసుడివి...' ఆమె బుసకొట్టినట్టంది.

'సరూ! ఆవేశపడకు. తొందరపడితే నీకే నష్టం...'

ఆమె చప్పరించినట్టు వెగటుగా నవ్వింది.

'నష్టం!! సృష్టి ఆదినుంచీ మగాళ్ళని నమ్మి నాశనమైన లక్షలాది స్త్రీలలో నేనొకర్తెనౌతాను. అంతేనా నువ్వనేది?...'

ఆమె కుర్చీలో కూచుంది. అతడిచ్చిన కాఫీ నిర్లక్ష్యంగా అందుకొని తాగుతోంది. అతడు సిగరెట్టు ముట్టించేడు.

'సీతారావుడూ! అసలు రాత్రిపూట తెలియని యింట్లో, చీకటి గదిలో, యౌవనంలో ఉన్న అమ్మాయి, అబ్బాయి ఎలా కలిసేరోయ్!'

బాబాయ్ ప్రశ్నించాడు. సీతారావుడు కుర్చీలో జారబడ్డాడు.

'చెప్తాగాని-అసలా సన్నివేశం ఎలావుంది బాబాయ్?'

'సన్నివేశమా! బాగుండదూ! ఇది రేడియో నాటికైతే మరీ బావుంటుంది. ఇట్టే ఏడుపులూ, ఇట్టే నవ్వులూ...'

'అసలిది రేడియో నాటిగ్గా మార్చేస్తున్నాను. బాబాయ్, నేనెన్నో రేడియో నాటికలు రాసేను...'

'ఔనౌను. ఆమధ్య విన్నా, రచన సి. సీతారావుడు అని చెప్పేరు. అదేదో రైల్లో జరిగిన...'

'ఔను బాబాయ్!'

సాయంత్రం, బాగా చీకటి పడింది. రైల్వే ప్లాట్ ఫారం అమ్మకాలు-చీరియో టాటాలు. గార్డువిజిలు. రైలుకూత. తరువాత "జప్

జప్" రైలుబండి పరుగు. ఇంతలో ఓ స్టేషన్ వస్తుంది. ఫస్టుక్లాసు పెట్టెలో ఒక యువకుడుంటాడు. అందంగా వుంటాడు. కాని విరాగిలా వుంటాడు. సిగరెట్టు కాలుస్తుంటాడు. ఆపెట్టెలో అతనొక్కడే వుంటాడు. ఇంతలో హఠాత్తుగా ఆ పెట్టెలో ఓ అమ్మాయెక్కుతుంది.

'మీరెక్కడికెడుతున్నారు?...'

'విధి ఎక్కడికి తీసుకెళ్ళితే అక్కడికి...నాకు గమ్యం లేదు ... నేను తెగిన గాలి పటాన్ని...'

తరువాత రైలు సైలెంటుగా వున్నప్పుడు వాళ్ళు టర్నుల ప్రకారం యేడుస్తూ వెగటుగా నవ్వుతూ—'ప్చ్' అంటుంటారు.

ఆమె : మరెక్కడికి వెడుతున్నారో చెప్పకూడదా?

అతడు : హరిద్వారం.

ఆమె : ఈ బండి హరిద్వారం వెళ్ళదే. అనకాపల్లి వెడుతుంది.

అతడు : పోనీండి అనకాపల్లే వెళతా ...

దబదబ శబ్దం. బ్రిడ్జిమీంచి రైలు వెళుతోంది. వాళ్ళ మాటలు వినబడవు. మాటలు వినపడనప్పుడు అసలు కంటికి కనపడదు కనక వాళ్ళేంచేస్తున్నా ఫర్వాలేదు.

పోతే ఇక్కడ కూడా రాత్రే...రైలు పెట్టెలో ఇద్దరే వ్యక్తులు ఆడ...మగ. చీకటి పడ్డాక సముద్రపొడ్డునా ఇదే.

హోటలు గదుల్లో ఇదే.

'సీతారావుడు, ఈ సన్నివేశాలు...'

'మంచి ఎఫెక్టుంది బాబాయ్...'

'సరే చదువూ...'

* * *

'బాబాయ్; నేనొక కథ రాస్తున్నా ...' నారాయణ పెన్నూ కాగితాల కట్టతో వచ్చేడు.

'రాయవోయ్ రాయ్. ఇదిగో సీతారావుడు దగ్గర శిష్యరికం చేస్తే నువ్వూ రాస్తావు కథలు, నాటికలు...'

'దేని మీద రాస్తున్నావు నారాయణ...?' సీతారావుడు.

'మన పని మనిషి అచ్చి మీద...'

సీతారావుడు విరగబడి నవ్వేడు.

'సరే ఎంతవరకు రాసేవు ?'

'అచ్చి కూతురు అప్పయ్మ్మ చూడ్డానికి రోతగా వుంటుంది. దాని తల్లో గేదెల్లాంటి పేలున్నాయి. గోచీ పెట్టుకొని ముక్కు చీవిడికారుతూ వాళ్ళ తమ్ముణ్ణెత్తుగుంటుంది. అప్పయ్మ్మ తమ్ముడు దుండు ముక్కలా ఉంటాడు. ముద్దొస్తుంటాడు. ఎత్తుకోవాల్నుంటుంది కాని అమ్మ చూస్తే కొడ్తుంది. వాడు తన అప్ప దగ్గరుండడు. హోరున ఏడుస్తాడు. పాపం చంటివాడి గోల విని అచ్చి అరుస్తూ గబగబ వస్తుంది.

'ఒరే వురే ముండకొడకా, దిక్కుమాల్నాడా ఏడవకురా, నీకిప్పుడే ముంచుకొచ్చిందిరా సావు. ఒలే దిక్కుమాల్నదానా - అప్పిగుంటా తమ్ముణ్ణెత్తుకోవే...'

చంటివాడు తల్లిని చూసి చిట్టిచిట్టి చేతులుచాచి మరీ యేడుస్తాడు. అది వాణ్ణెత్తుకుని పాలిస్తుంది. వాడు పాలుతాగుతూ వూరుకుంటాడు...

'ఇంకా వుంది బాబాయ్, బాగుందా?'

'బాగుందోయ్, ఇంకారాయి...' బాబాయి.

సీతారావుడు కథ చదివి వెళ్ళిపోయాడు.

'అచ్చీ అచ్చీ యెక్కడికి పోయావే ... నీ పని ఏడిసినట్టేవుంది. ఇద్దరు పిల్లలకీ నలుగులుపెట్టి అరగంటైంది. వాళ్ళకి పులుసు పొయ్యక

ఎక్కడ చస్తున్నావే; ఇలా దబ్బడదిబ్బడ పనిచేస్తే నీ పని నాకక్కర్లేదు ఫో...'నారాయణ తల్లి పెరట్లోంచి అరిచింది.

'ఒలే అప్పిగుంట, తియ్యవే తమ్ముడ్ని. ఈదినోకి తీసుకెళ్ళి పంది పిల్లల్ని సూపించవే...'

'ఒత్తన్నానమ్మ...ఎక్కడా సావనేదు. సంటోడు పాలకేడిస్తేడు ఎళ్ళా...' అచ్చి.

'నీ పనికి చంటోడొకడు-ఆ సౌడభ్యం మాకే. పిల్లల నలుగులూడి పోయాయ్. ఝూవైంది. వెధవపని. రారా!'

'చూసావా బాబాయ్, చంటివాడు ఆకలేసి యేడుస్తుంటే అమ్మెలా అరుస్తుందో! అచ్చి కథలో అమ్మ గురించికూడా రాసేస్తాను బాబాయ్.'

'అలాగేకాని-ఎల్లుండి మీ బొబ్బిలి పిన్నొస్తూంది. ఆవిడ మంచి రచయిత్రి....'

'అంటే...'

'అంటే మన సీతారావుడిలాగే రాస్తుంది. నవలలు రాస్తుంది. పిన్ని దగ్గిర కథ వ్రాయడం నేర్చుకో....'

'అయితే బొబ్బిలి పిన్ని పాలకేడుస్తూన్న అచ్చికొడుకు కథ రాస్తుందా...'

'ఏమో-ఇప్పటి కప్పుడే ఆరు నవలలు రాసింది. నెలకో నవల దంచి పారేస్తుంది తెలుసా....'

'అయితే బాబాయ్-బొబ్బిలి పిన్ని మరి వంట చెయ్యదా?'

'వండుతూ రాసేస్తూనైనా ఉండాలి. లేకుంటే రాస్తూ వండేస్తూనైనా ఉండాలి....'

బొబ్బిలి పిన్నొచ్చింది.

'బాబాయ్, ఏమిటి చదువుతున్నావు!'

'ఇదా? ఇదొక వ్యాసాల సంపుటం. దీని పేరు నేనెందుకు రాస్తున్నా..'

'ఎవ్వరా సేరు?'

'ఒకరు కాదు. పదిమంది. వాళ్ళెందుకురాసేరో, రాస్తున్నారో, యెవరికోసం రాస్తున్నారో యీ వ్యాసాల్లో వివరించేరు. నువ్విప్పుడేం రాస్తున్నావూ?'

'మూడు నవల్లు ఒకేసారి రాస్తున్నా బాబాయ్...'

'అద్భుతం! ఎంత ఓపికమ్మా నీకు'

'ఏఁవుంది బాబాయ్! కూచుంటే అలా అరవై పేజీలు రాసేస్తా. రాస్తున్న వాటిలో ఒక నవలతెచ్చా. పొద్దున్న లేస్తూనే యాభై పేజీలు రాశా...'

'పిన్నీ! నాకు నవల్లు రాయడం నేర్పవూ...?' నారాయణ.

'అలాగేనోయ్...'

'పిన్నీ పిన్నీ! నేను అచ్చికథ రాస్తున్నా. ఇది దిద్దవూ...?'

'అచ్చెవరోయ్...?'

'మన పనిమనిషి. దాని కొడుక్కి పాల్లేవు పిన్నీ. వాడెంత బావుంటాడో చూసేవా? మన తమ్ముడికంటె బావుంటాడు. వాడికెప్పుడూ ఆకలో యేమో ఏడుస్తూడుంటాడు పిన్నీ...'

'పాల్లేకపోతే పాలడబ్బా కొనమను అచ్చిని...'

'దానికి డబ్బులేదు పిన్నీ-అమ్మ కొనదు....'

'అచ్చి కొడుక్కి అమ్మెందుకొనాలంటుంది? అచ్చే కొనుక్కోవాలి.'

'మరి తమ్ముడికెందుకొనాలంటుంది అమ్మ?'

'తమ్ముడు మనవాడు కాబట్టి...'

'పోనీ నువ్వుకొను పిన్నీ...'

'ఛీ: నేనెందుకొంటాను...'

'మీరంతా ఒకటే పిన్నీ. పాపం అచ్చికొడుక్కి నిన్నట్నించీ విరోచనాలు. మందులేదట, పెద్దాస్పత్రిలో అచ్చికొడుక్కి మందివ్వరట. అక్కడ డబ్బున్న వాళ్ళకే యిస్తారట. డబ్బున్నవాళ్ళకి జబ్బు లేకపోయినా మందిస్తారట. అచ్చి కొడుకెక్కలావుందో: అచ్చొక్కర్తేవుందిట ఆస్పత్రిలో.. అప్పయ్య చిన్న గుంటైనా మన యింటి పనంతా చేస్తూంది....'

'అచ్చి మొగుడేమయేడు...?'

'దానిమొగుడా: వట్టి తాగుబోతు. పిన్నీ ఇంతాచూస్తే నాకు బాధగా వుంటుంది. నేను అచ్చి కథరాస్తా...తప్పులుంటే దిద్దవూ, ఏ పత్రికకైనా పంపుతా...'

'అచ్చి కథలూ, పిచ్చి కథలు ఏ పత్రికా ప్రచురించదు.'

'ఎందుకు ప్రచురించదు: పంది పిల్లల గురించి వ్రాస్తే ప్రచురిస్తారా ? రోజూ పొద్దున్నే మన వీధంట ఒక పెద్ద పంది, దాని వెనుక నాల్గు చిన్న పంది పిల్లలూ గునగున ఆగాకరకాయిల్లా దొర్లుకుంటూ వెళిపోతుంటాయి. మొన్ననేం జరిగిందో తెలుసా: నేను వీధరుగుమీద పళ్ళు తోముకుంటున్నా, మన యెదురింటి డాక్టరుగారి బొచ్చుకుక్క పంది పిల్లలమీద కలియబడి వెంట తరిమింది. ఆ పిల్లలు భయపడి గుయ్‌గుయ్ మంటూ నాలుగువేపులా పరిగెత్తాయి. పాపం ఒక ముద్దొస్తున్న పందిపిల్ల మునిసిపల్ చెత్తబండి చక్రం కిందపడి చచ్చిపోయింది. పిన్నీ ...అచ్చి కథలో పంది పిల్లల కథ కూడా కలిపి రాస్తాను పిన్నీ...'

'సరే అఘోరించినట్టే వుంది. ఏదో రాయ్. చూసావా బాబాయ్ యితని ఊహలు. పని పిల్లమీద కథ రాస్తాట్ట...' పిన్ని పెదవి విరిచింది.

'వాడిలో ఏదో బాధ వున్నట్టుంది సీతమ్మా: ఆ బాధతోనే కథ రాయాల్ని వాడి తపనలా వుంది. నువ్వు తెచ్చిన నవలలో విషయం యేమిటి...?'

'బావ మరదళ్ళు చిన్నప్పటినించీ ప్రేమించుకొంటారు. కానీ ఆ మేనరికం జరగదు...'

'ఏం?'

'అమ్మాయి తండ్రి తన కూతురికి ఓ పెద్ద సమ్మంధంచూసి పెళ్లి చేస్తాడు. అల్లుడు ఢిల్లీలో పెద్ద ఉద్యోగి. అనురాధ భర్తతో ఢిల్లీ వెళి పోతుంది. 'అనూకి' భర్తంటే చాలా భక్తి. కానీ ఆమె మనసు శేఖరం బావ మీదుంటుంది. కొత్తపేటలో శేఖరంబావ పైలట్ఆఫీసరై ఢిల్లీవస్తాడు. అక్కడొక డాక్టరుతో అతనికి స్నేహం కుదురుతుంది. ఆ డాక్టరు భార్య "సుమిత్ర." సుమీ, శేఖరంబావ యూనివర్శిటీలోసహాధ్యాయులు. సుమీ శేఖరంబావని ప్రేమించింది. శేఖరంబావ – సుమీ, అనూల ప్రేమమధ్యపడి నలిగిపోతాడు. ఓనాడు డాక్టరు సుమీ, శేఖరంబావ ఢిల్లీలో తాజ్‌మహ లుకి షికారు వెడతారు..."

'సీతమ్మా! తాజ్‌మహల్ ఢిల్లీలో లేదే...'

'మంచివాడివే బాబాయ్. అంత గొప్ప కట్టడం ఢిల్లీలోకాక కొత్త పేటలో వుంటుందా?' టకాయించింది రచయిత్రి.

'లేదు సీతమ్మా ఆగ్రాలో ఉంది!'

'నిజమే? చంపేవే. నేను రెండేళ్ళ క్రితం రాసిన నవలలో ఇలాగే రాసేనే. దానికి ప్రథమ బహుమతి వచ్చింది.'

'పోనీ – ఈ నవలలో సరిగారాయి...'

'ఈ ఘట్టం ఢిల్లీలోనే జరగాలి. పోనీ తాజ్‌మహలు లేకపోతే బీచికి వెళ్లారని మార్చేస్తా...'

'హతోస్మి! ఢిల్లీలో బీచీలేదు...'

'ఏవిటి బాబాయ్...ఏది చెప్పినా లేదంటావు. కొంపదీసి ఢిల్లీలో అజంతా గుహలు కూడా లేవంటావా?'

'లేవు...'

'నన్ను ఖూనీ చేస్తున్నావు బాబాయ్. ఢిల్లీలో అజంతా గుహల దగ్గరే కథానాయకుడు, నాయకి తొలిచూపుల్లోనే వలపులో పడ్డారని నా రెండోనవల్లో రాసేను. దానికి రెండో బహుమతి వచ్చింది...'

'భేషో - ఎన్ని తప్పులు రాస్తే అంత పెద్ద బహుమతి అన్నమాట?'

సీతమ్మని వాళ్ళక్క పిలిచింది.

మధ్యాహ్నం బెదురు కళ్ళతో, బెంగ గుండెతో అచ్చి వచ్చింది.

'అమ్మగోరూ! పదిరూపాయ లిప్పించండి. సంటోడి కిండీసనిప్పించాలి. తల్లీ- సచ్చి మీ కడుపున పుడతా...'

'నా దగ్గర డబ్బులేదు...' నారాయణ తల్లి.

'అమ్మమ్మా...నేదనక - సంటోడు సావుబతుకుల్లో వున్నాడు. ఓసెయ్యాఓకాలు యెగరేత్తన్నాడు. మిడిగుడ్లు పడ్డాయి. నేదనక తల్లీ - నెలకో రెండ్రూపాయిలిరుసుకో...'

'లేదంటే నీక్కాదే ముండా. పెద్దాసుపత్రికి తీసుకెళ్ళిపో. వాళ్లే ఇస్తారు ఇంజక్షను."

'తీసుకెళ్లా తల్లీ? ఆళ్ళు సేర్చుకోనేదు. పొద్దుటికాణ్ణించీ ఆసుపత్రి వరండామీనే కూకున్నాం నేనూ మావాఁ సంటోణ్ణట్టుకుని. ఆ డాట్టర్లు నరసమ్మలూ - ఆళ్లాటలూ నవ్వులూ ఆళ్ళవేగాని మానాటోల్ని సూద్రు. తీసుకుపో అన్న మాటేగాని సంటోణ్ణి సూణ్ణయినానేదు. ఇంటికి తీసుకొచ్చీసినాం. సెట్టి డాక్టరుగోర్ని తీసుకొచ్చి చూపించేం. ఇండీసనివ్వాల - పది రూపాయలు కావాలన్నారు-ఇయ్యి తల్లీ' అచ్చి ఏడుస్తూ ప్రాధేయపడింది.

'లేదంటే వినదేం శనిగొట్టులాగ. లేదే, లేదే, లేదు సరా. మరెవ రైనా అడుగు. వేగం వెళ్లు. కాస్సేపటికి వాడు నయంగా వుంటాడు. మధ్యాహ్నం పని మాత్రం యెగ్గొట్టేకు.'

అచ్చి ఏడుస్తూ పోయింది.

'బాబాయ్! అచ్చికి డబ్బెందుకు లేదూ?' నారాయణ.

'లేదు——'

'దాని కొడుక్కి మందెందుకు లేదూ!'

'లేదంతె...'

'డాక్టర్లు డబ్బు అక్కర్లేకుండా యింజక్షనివ్వరా?'

'ఇవ్వరు...'

'ఏం?'

'అంతే...'

'బాబాయ్! అచ్చికథ ఎంత జాలి కలిగిస్తుంది? ఈ కథ తప్పక రాస్తాను బాబాయ్.'

'రాయిగాని, నీ పిచ్చి కథ యే పత్రికా ప్రచురించదని పిన్ని చెప్పిందే...'

'ఎందుకు ప్రచురించదు బాబాయ్...'

'అదంతే...'

ఆ సాయంత్రం సీతారావుడు తన స్నేహితుడు 'కిట్టూ'తో బాబాయుని చూడ్డానికొచ్చేడు.

కిట్టూ యిరవై యేళ్ళలోపువాడు. నూనుగు మీసాలు, నొక్కుల జుట్టు. బుష్‌షర్టు, నీటిగొట్టం పంట్లాం తొడుక్కున్నాడు.

'బాబాయ్! నువ్వా పుస్తకం వదిలేలా లేదు. ఇతను మా ఫ్రండు 'కిట్టూ' గొప్ప రచయిత' సీతారావుడు.

బాబాయ్ 'అలాగా' అన్నాడు. కిట్టూ నవ్వేడు.

'మీరేం రాస్తున్నారు...' బాబాయ్.

'నేను చిన్నప్పుడు జోక్సు రాసేను.'

'పెద్దయేకా ఏం రాస్తున్నారు?'

'క్రైమ్ అండ్ డిటెక్షన్‌లో బాగా కృషి చేశాను. ఇరవై నవలలు రాసేను. ఇప్పుడిప్పుడు 'సెక్స్' మీద రాస్తున్నా. నా 'టెలిఫోన్ హంతకుడు' 'మాట్లాడిన శవం' 'సరస్వతి హత్య' మొదలైన డిటెక్టివ్ నవల్లు చాలా పేరు మోసాయి. కిందటి వారం రెండు నవలలురాసి మదన్ పబ్లిషర్సుకి అమ్మేను. 'పంతులమ్మ ప్రణయగాథ' 'చిరునవ్వుల సెక్రటరీ'. ఈ మధ్య మూడ్రోజులు వేరే పనుండి రాయలేదు. నెలాఖరులోపున నాలుగు నవల్లు పూర్తిచెయ్యాలి. ఒక పబ్లిషరు బెత్తాయించేడు. బయానా కూడా యిచ్చేసేడు...'

బాబాయ్ విప్పిననోరు ముయ్యలేదు. ఊపిరితిత్తుల్లోకి వెళ్ళినగాలి అక్కడే వుండిపోయింది.

'హుం. మీరు రాత్రి రాస్తారా? పగలా?' బాబాయ్.

'రాత్రీ పగలూ...'

'చదువెప్పుడు ?'

'అబ్బే... చదవడానికి టైమ్‌లేదండీ, తీరికలేక కాలేజీ చదువు కూడా మానేశా. రాయడానికే టైమ్ చాలడంలేదు...'

అప్పటికి కొంచెం ముందే సీతమ్మ అక్కడికొచ్చింది. కిట్టూమాటలు విని అదిరిపోయింది. అసూయపడింది.

'సీతమ్మా ! చూసేవా. సీతారావుడిమీద నువ్వుపోటీ. నీమీద కిట్టూ గారు పోటీ'.

బాబాయ్! నాకింట్లో చచ్చినంత చాకిరీ. అందులోనే తెరిపి చేసుకొని యేదో రాస్తున్నా. రెండేళ్ళలో పదినవల్లు రాసేనంటే నాకదే గొప్ప. నాకూవుంది నెలకి రెండు నవల్లు రాయాల్ని. కాని తీరికేది!' సీతమ్మ ఉదాసీనంగా అంది.

కథా నిలయం



'పోనీలే. వంటలక్కనే పెట్టుకో. అప్పుడు నీకంతా తెరిపే. వారానికో మూడు నవల్లైనా రాయచ్చు. ప్రజలకేం కావాలో అదే రాయాలా? ఏంరాస్తే ప్రజలదే చదువుతారా? ఇవి ప్రశ్నే కాదు.' బాబాయ్.

'నిజం బాబాయ్! ఈనాడు రచనకి బాగా మార్కెట్టున్నట్టు పూర్వం ఎప్పుడూ వుండి వుండదు...' సీతారావుడు.

'నిజం నిజం - దేశంలో ఎంతో అజ్ఞానంవుంది. అవిద్యవుంది. కుల మత ద్వేషాల కుమ్ములాటవుంది. కటిక దరిద్రం వుంది. లంచగొండితనం వుంది. మోసం, దగా వున్నాయి. మతాతత్వంవుంది. రోగాలు రొచ్చు లున్నాయి. కరువు కాటకాలున్నాయి. తిండిలేక ఒళ్ళు బజారు పాలుచేసిన వాళ్ళున్నారు. బతకలేక ఉరిపోసుకున్న వాళ్ళున్నారు. నిజంగా వైతరిణి నదిలా వుంది మన సమాజం. కాని రచనకి యివేం సామాగ్రి కావు. ప్రేమ, సెక్సు, డిటెక్షన్, నైనిటాల్, కొడైకెనాల్, విహారయాత్రలు, కార్లు ప్లేన్లలో ప్రయాణాలు, లవ్ ట్రయాంగిల్‌లో లజ్జుగుజ్జులు-ఇవీ మనకి కావలసినవి. పోనీ ఏదో వొకటి రాస్తున్నారు అదే పదివేలు...' బాబాయ్ నిట్టూర్చేడు.

గబగబ మేడమీంచి నారాయణ రొప్పుతూ వచ్చాడు. అతని మొహం వివర్ణంగా వుంది. గొంతు ఎండి మాట రావడం లేదా తొమ్మిదేళ్ కుర్రాడికి.

'బాబాయ్! విన్నావా!'

'ఏమిటోయ్?'

'వినపడ్లేదా?'

'ఏమిటోయ్ అంతగాభరా...?' సీతమ్మ. సీతారావుడూ, కిట్టూ బిక్కపోయి చూస్తున్నారు.

'మీ కెవ్వరికీ వినిపించలేదా? భగవాన్! ఆ యేడుపు వినిపించదా ఆ గుండెల చప్పుడు వినిపించలేదా! వెనక సందులోంచి తెగుతున్న ఆ గుండె పటపట మీ చెవుల్దాక రానేలేదా?'

బాబాయ్ అదిరిపడ్డాడు. 'నేనెందుకు రాస్తున్నా' గట్టిగా - నలిగి పోయినంత గట్టిగా పట్టుకున్నాడు.

'బాబాయ్ ! బాబాయ్ ! అచ్చికొడుకు చచ్చిపోయేడు. పాల్లేక, మందులేక 'కీ'లేని గడియారంలా ఆగిపోయేడు. అందంగా, బంతిలా ఉన్న అచ్చికొడుకు మరి లేడు. బండి చక్రం కిందపడి నలిగిపోయి చచ్చిపోయిన పందిపిల్ల. ఆకలేసి, మందులేక చచ్చిపోయిన అచ్చికొడుకు - ఈ రెండు కధలే రాస్తాను బాబాయ్! నిజానికివి రెండు వేరువేరు కథలుకావు బాబాయ్ ఒకటే. ఆ ఒక్క కథే జీవితాంతం రాస్తాను బాబాయ్' ఆవేశంతో అన్నాడు తొమ్మిదేళ్ళ నారాయణ. (ఈ చివరి మాటలు తొమ్మిదేళ్ళ కుర్రాడన వలసిన మాటలేనా అని ముక్కుమీద వేలువేసుకోకండి. అవి నా మాటలే.) 'నేనెందుకు రాస్తున్నా' బాబాయి చేతిలోంచిజారి కింద పడిపోయింది.